చదువు




**కోర్సు స్వరూప స్వభావాల దగ్గర్నుంచి, శిక్షణ పద్ధతులు, నియామకాల వరకు నిత్యనూతనంగా మారుతోన్న సబ్జెక్టు... మేనేజ్‌మెంట్. ఇందులో ఆచరణాత్మక జ్ఞానానికి ప్రాధాన్యం బాగా పెరుగుతోంది. అందువల్ల ఎంబీఏ కోర్సులను ఎంచుకునేటప్పుడు విద్యార్థులు అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఏదో ఒకటి చదవాలి కాబట్టి ఎంబీఏ చేద్దామనుకోవడం సరైన ఆలోచన కాదు. సీటు వచ్చింది కదా అని మేనేజ్‌మెంట్ కోర్సులను ఎంచుకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురు కావచ్చు. విద్యార్థి ఆసక్తి, నేపథ్యం, భవిష్యత్తు కెరియర్ ప్రణాళికలను దృష్టిలో ఉంచుకొని మేనేజ్‌మెంట్ కోర్సులను ఎంచుకోవడం మంచిది.**

# ముందు చూపుతో... మేనేజ్‌మెంట్

ప్రపంచవ్యాప్తంగా వ్యాపార రంగంలో ఎన్నో పరిణామాలు వస్తున్నాయి. భారీ యంత్రాలు, ఉత్పత్తుల స్థానంలో సేవల రంగం, ఇ-సర్వీసులు ఆర్థిక వ్యవస్థలకు పునాదిగా మారుతున్నాయి. దీని ప్రభావం మేనేజ్‌మెంట్ విద్యపై గణనీయంగా ఉంటోంది. మేనేజ్‌మెంట్ విద్య ఇతర కోర్సులు, సబ్జెక్టులతో పోల్చుకుంటే కొత్తదని చెప్పవచ్చు. వర్కింగ్ ఎగ్జిక్యూటివ్‌లకు పార్ట్ టైమ్ మేనేజ్‌మెంట్ కోర్సులు ఎప్పటినుంచో ఉన్నాయి. కానీ పూర్తి స్థాయి మేనేజ్‌మెంట్ కోర్సులు అందుబాటులోకి వచ్చింది ఇటీవలి కాలంలోనే! 1980 తర్వాత అనేక ప్రభుత్వ యూనివర్సిటీలు మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించాయి.

మేనేజ్‌మెంట్ విద్య గణనీయంగా విస్తరించింది కూడా గత ఇరవై ఏళ్లలోనే! ఈ సమయంలోనే యూనివర్సిటీలకు అనుబంధంగా ప్రైవేటు కాలేజీలు బాగా విస్తరించాయి. గడచిన పదేళ్లలో మేనేజ్‌మెంట్ విద్యలో అనేక మార్పులు వచ్చాయి. కంపెనీలు, విదేశీ విద్యాసంస్థలతో భాగస్వామ్యం ద్వారా విభిన్న స్వతంత్ర ప్రోగ్రామ్‌లు అందుబాటులోకి వచ్చాయి.



**జి.ఆర్.రెడ్డి**
ఎం.డి., Husys

అందించే ప్రోగ్రామ్‌లు, నిర్వహణ ఆధారంగా మేనేజ్‌మెంట్ స్కూళ్లను కింది విధంగా విభజించవచ్చు..

- ప్రభుత్వం స్థాపించిన ఐఐఎంలు
- యూనివర్సిటీల్లో ఏర్పాటైన ఎంబీఏ విభాగాలు
- యూనివర్సిటీలకు అనుబంధంగా కొనసాగే ప్రైవేటు కాలేజీలు
- దేనికీ అనుబంధం కాని స్వతంత్ర మేనేజ్‌మెంట్ స్కూళ్లు.
- విదేశీ బి- స్కూళ్లతో కలిసి డ్యుయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లను అందించే సంస్థలు.
- ఆన్‌లైన్ ఎంబీఏలను అందించే విదేశీ యూనివర్సిటీలు

వివిధ స్కూళ్లలో అందించే మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌ల స్వభావాన్ని బట్టి వాటికుండే ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయి. కోర్సు నిర్మాణం, మేనేజ్‌మెంట్ సూత్రాల ఆచరణకు ఇస్తోన్న ప్రాధాన్యం, నెట్‌వర్క్ అవకాశాలను బట్టి ఈ కోర్సులను ఎంచుకోవచ్చు.

## ప్రోగ్రామ్‌లలోనూ వైవిధ్యం

ఆర్థిక వ్యవస్థలో పరిణామాల ఆధారంగా అనేక మేనేజ్‌మెంట్ స్కూళ్లు అంతర్జాతీయ స్థాయి సిలబస్‌తో ప్రోగ్రామ్‌లను తయారు చేస్తున్నాయి. ముఖ్యంగా భారత్, చైనాలలో అందిస్తోన్న అనేక మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లు ప్రపంచంలోని ఉన్నత స్థాయి బి- స్కూళ్లకు సవాలుగా మారుతున్నాయి. హార్వర్డ్ బి-స్కూలు కూడా భారతీయ కంపెనీల అవసరాలకు సరిపోయే విధంగా ఎగ్జిక్యూటివ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లను తయారు చేసింది. ప్రస్తుతం మనదేశంలో అందుబాటులో ఉన్న ప్రోగ్రామ్‌ల స్వరూప స్వభావాలు...

- జనరల్ / సెక్టోరల్/ ఫంక్షనల్ ప్రోగ్రామ్‌లు. వీటిలో ఏడాది లేదా రెండేళ్ల ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లు, మూడేళ్ల పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి.
- ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రామ్‌లు (ఐఐఎంలతోపాటు అనేక ప్రముఖ ప్రైవేటు బిజినెస్ స్కూళ్లు ఈ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నాయి.)
- దూరవిద్య ద్వారా ఎంబీఏ (ఇగ్నోతోపాటు, ఇతర రెగ్యులర్ ప్రభుత్వ, ప్రైవేటు బి-స్కూళ్లు కూడా దూరవిద్య కోర్సులను అందిస్తున్నాయి.)
- ఆన్‌లైన్ ఎంబీఏ (ఎక్కువగా విదేశీ సంస్థలే ఆన్‌లైన్ ఎంబీఏలను నిర్వహిస్తున్నాయి.)
- ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు (ఇవి ప్రధానంగా వర్కింగ్ ఎగ్జిక్యూటివ్‌లకు ఉద్దేశించినవి)
- డాక్టొరల్, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు
- మేనేజ్‌మెంట్ రిసెర్చ్ ప్రోగ్రామ్‌లు
- విదేశీ సంస్థలు అందించే ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు

## స్పెషలైజేషన్లలో పోటీ

పరిశ్రమలు, వాటి వ్యాపార తీరు, అందిస్తోన్న సేవల్లో ఎన్నో మార్పులు వస్తున్నాయి. కొత్త వ్యాపార అవసరాలకు అనుగుణంగా మేనేజ్‌మెంట్ విద్యను అందించడంలో బిజినెస్ స్కూళ్లు పోటీ పడుతున్నాయి. ఫ్యాకల్టీ, ఇంటర్నేషనల్ రిసెర్చ్ అండ్ పబ్లికేషన్, పరిశ్రమలతో అనుసంధానం, ప్లేస్‌మెంట్లు, పాఠ్యప్రణాళికలో మార్పులు, తదితర అంశాల్లో పైచేయి సాధించడానికి మేనేజ్‌మెంట్ స్కూళ్లు ప్రయత్నిస్తున్నాయి. దీనికి అనుగుణంగా అనేక నూతన స్పెషలైజేషన్లు అందుబాటులోకి వస్తున్నాయి. ఎంబీఏ జనరల్, హెచ్.ఆర్., ఫైనాన్స్, మార్కెటింగ్, ప్రొడక్షన్, ఐటీ/ సిస్టమ్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ముఖ్యంగా సొంత వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి) లతోపాటు ఎన్నో కొత్త స్పెషలైజేషన్లు ఎంచుకునే అవకాశం ఉంది. అవి...

- రిటైల్ మేనేజ్‌మెంట్
- బయోటెక్నాలజీ మేనేజ్‌మెంట్
- బీపీఓ మేనేజ్‌మెంట్
- ఫార్మా మేనేజ్‌మెంట్
- బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఫైనాన్స్
- ఏవియేషన్ మేనేజ్‌మెంట్
- హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్
- టూరిజం మేనేజ్‌మెంట్
- హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్
- టెలికాం మేనేజ్‌మెంట్
- అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్
- ఇన్సూరెన్స్ మేనేజ్‌మెంట్
- సర్వీసెస్ మేనేజ్‌మెంట్

ఎంబీఏ చేయాలనుకునే అభ్యర్థులు తమకు సరిపోయే స్పెషలైజేషన్‌ను ఎంచుకోవాలి. పైన తెలిపిన స్పెషలైజేషన్లు ఆయా పరిశ్రమల్లో స్థిరపడాలనుకునే అభ్యర్థులకు ఉపయోగపడతాయి. వీటిని ఎంచుకునే ముందు అభ్యర్థులు తమ సామర్థ్యాలను, వ్యక్తిత్వాన్ని, కెరియర్ లక్ష్యాలను పరిగణనలోకి తీసుకోవాలి.

### తాజా ధోరణి... యువ సీఈఓలు

ఇరవై ఏళ్ల కిందట కంపెనీ సీఈఓల సగటు వయసు 55 ఏళ్ల కంటే ఎక్కువగా ఉండేది. పదేళ్ల క్రితం కూడా సగటున 35 ఏళ్లు పైబడిన వారే ఎక్కువగా కంపెనీలకు సీఈఓలుగా ఉండేవారు. ప్రస్తుతం కంపెనీల ఉన్నత స్థాయి మేనేజ్‌మెంట్ వ్యక్తుల సగటు వయసు సుమారు 30 సంవత్సరాలు. వ్యాపార స్వభావంలో మార్పులు రావడం, ఉద్యోగాల కంటే సొంతగా కంపెనీ / వ్యాపారం ప్రారంభించాలనే దృక్పథం (ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్) ఎంబీఏ అభ్యర్థుల్లో పెరుగుతుండటం దీనికి కారణాలు. ఈ ధోరణి నాణ్యత, ప్రమాణాలు గల ఎంబీఏ ప్రోగ్రామ్‌లకు డిమాండ్‌ను పెంచుతోంది.

## సామర్థ్యాలు కీలకం

నిరంతరం పెరుగుతోన్న పోటీ, మార్పులకు గురవుతోన్న వ్యాపార వాతావరణంలో కంపెనీలు నెగ్గుకురావాలంటే సమర్థులైన మేనేజర్లు చాలా అవసరం. మేనేజ్‌మెంట్ కోర్సులు చదవాలనుకునే అభ్యర్థులు ఈ విషయాన్ని గ్రహించాలి. కంపెనీలకు అవసరమయ్యే సామర్థ్యాలు, వాటి ప్రాథమ్యాలు కూడా ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కమ్యూనికేషన్, ప్రెజెంటేషన్, నెగోషియేషన్, లీడర్‌షిప్ లాంటివి పాత సామర్థ్యాల జాబితాలోకి వెళ్లిపోయాయి. ప్రస్తుతం మేనేజ్‌మెంట్ కెరియర్‌లో నెగ్గుకురావాలంటే కొన్ని కొత్త సామర్థ్యాలు తప్పనిసరిగా పెంపొందించుకోవాలి.

**వ్యాపార దృక్పథం:** ఈ వ్యక్తిత్వ లక్షణం లేకుండా మంచి మేనేజ్‌మెంట్ కెరియర్‌ను ఆశించవద్దు. చేసే ప్రతి ప్రాజెక్టు/ పని/ చర్యలోనూ వ్యాపార దృక్పథం ఉట్టిపడాలి. చేస్తోన్న ప్రాజెక్టు లేదా పనిలో ఉండే వ్యాపార విలువను గ్రహించాలి. దాని ఆధారంగా వివిధ రూపాల్లో కంపెనీకి ప్రయోజనం సాధించగలగాలి.

**సాంకేతిక పరిజ్ఞానం:** టెక్నాలజీతో సంబంధం లేకుండా ఏ పనీ జరగని రోజులివి. విధి నిర్వహణలో ఏ మేరకు టెక్నాలజీని వాడుతున్నారనే దాన్ని బట్టి వ్యాపార స్థాయిని అంచనా వేస్తున్నారు. మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్లు టెక్నాలజీని ఉపయోగిస్తూ పీపుల్ మేనేజ్‌మెంట్ ఎలాగో నేర్చుకోవాలి. కొత్త టెక్నాలజీలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆచరణలో పెట్టాలి.

**నెట్‌వర్కింగ్:** ఎక్కువ మందితో సంబంధాలు ఏర్పరచుకోవడం, వాటిని కొనసాగించడం, ఆ సంబంధాలు వ్యాపారానికి ఉపయోగపడేలా మలచడం ఆధునిక వ్యాపార ధోరణి. మేనేజ్‌మెంట్ అభ్యర్థులు కెరియర్‌లో ఎదిగేకొద్దీ నెట్‌వర్కింగ్ అవసరం పెరుగుతుంటుంది. వ్యక్తిగత నెట్‌వర్క్, బిజినెస్ నెట్‌వర్క్, గ్లోబల్ నెట్‌వర్క్ కూడా దీని పరిధిలోకి వస్తాయి. సోషల్ నెట్‌వర్క్‌లు, గ్రూప్‌లు కూడా వ్యాపారానికి ఏ మేరకు ఉపయోగపడతాయో ఆలోచించాలి. కనీసం 5000 మందితో కూడిన నెట్‌వర్క్ ఏర్పరచుకోవడం ఇప్పుడు పెద్ద విశేషమేమీ కాదు!

**అంతర్జాతీయ దృక్పథం:** ప్రస్తుతం అన్ని వ్యాపారాలు అంతర్జాతీయ రూపు రేఖలు సంతరించుకుంటున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని మేనేజ్‌మెంట్ అభ్యర్థులు వివిధ దేశాల సంస్కృతి, ప్రభుత్వ నిబంధనలు, పని సంస్కృతి, టీమ్‌ల అనుసంధానం, తదితర అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

## నియామకాలు - రకరకాలు

మేనేజ్‌మెంట్ అభ్యర్థుల నియామకాల్లో కూడా దేశవ్యాప్తంగా అనేక మార్పులు వస్తున్నాయి. ఎంబీఏ అభ్యర్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు ఉండటం కూడా ముఖ్యమైన అర్హతగా కంపెనీలు భావిస్తున్నాయి. చిన్న, మధ్య తరహా కంపెనీల సంఖ్య పెరుగుతుండటంతో సమర్థులైన అభ్యర్థుల కొరత ఏర్పడుతోంది. భవిష్యత్తులో ఎక్కువ నియామకాలు ఈ కంపెనీల్లో జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం విద్య, ఐటీ కన్సల్టింగ్, కేపీఓ, మేనేజ్‌మెంట్ ఫంక్షనల్ బీపీఓ, రిటైల్, ఇన్సూరెన్స్, సర్వీసెస్, కమ్యూనికేషన్, హెల్త్‌కేర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, తదితర రంగాలు ఎంబీఏ అభ్యర్థులను ఎక్కువగా నియమించుకుంటున్నాయి.

ఎంబీఏ అభ్యర్థుల నియామకాల్లో ఇటీవలి ధోరణి ఏమిటంటే... కంపెనీలు అభ్యర్థుల అర్హతల కంటే విలువ ఆధారిత నియామకాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. వేతనాల విషయంలో కూడా అభ్యర్థి కంపెనీకి చేకూర్చగల విలువను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటున్నాయి. దీనితోపాటు కంపెనీలు అభ్యర్థుల్లో పరిశీలించే అంశాలు...



- ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ కంపెనీ ఆదాయం పెరగడానికి అభ్యర్థి ఏమేరకు ఉపయోగపడగలడనేది పరిశీలిస్తాయి.
- కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించగల సామర్థ్యాలు ఉన్నాయా, లేవా అనేది చూస్తాయి.
- మంచి విజయాలు సాధించే బృందాన్ని తయారుచేయగల పీపుల్ మేనేజ్‌మెంట్ సామర్థ్యాలు ఎంతవరకు ఉన్నాయనేది అంచనా వేస్తాయి.
- కంపెనీ మార్కెట్‌ను విస్తృత పరచడానికి అవసరమైన వ్యాపార అవగాహన అభ్యర్థికి ఉందా లేదా అనేది పరిశీలిస్తాయి.
- విధి నిర్వహణలో క్రమం తప్పకుండా అత్యున్నత ప్రమాణాలు పాటిస్తూ సేవలందించగలడా లేదా అనేది చూస్తాయి.

### పద్ధతుల్లో మార్పులు

మంచి ప్రతిభాపాటవాలు గల అభ్యర్థులను నియమించుకోవడానికి కంపెనీలు అనేక పద్ధతులను పాటిస్తున్నాయి. వాటిలో కొన్ని....

- మేనేజ్‌మెంట్ ట్రెయినీ స్కీమ్‌ల ద్వారా అభ్యర్థులను కంపెనీలు ఎక్కువగా నియమించుకుంటున్నాయి. ఇది సాంప్రదాయ నియామక పద్ధతి. ఇలా నియామకం పొందినవారికి కొన్నాళ్లు వివిధ దశల్లో పని నేర్చుకునే అవకాశం కల్పిస్తాయి.
- ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించడం ద్వారా నియమించుకోవడం మరో పద్ధతి. క్యాంపస్ ప్లేస్‌మెంట్ల కంటే ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టుల ద్వారా ఉద్యోగం సాధించడం తేలిక. కంపెనీలు కూడా ఇంటర్న్‌షిప్ కాలంలో అభ్యర్థిని క్షుణ్నంగా పరిశీలించి అంచనా వేయగలుగుతాయి.
- 1-2 రోజుల పని / ప్రాజెక్టు ఆధారంగా కూడా కంపెనీలు మేనేజ్‌మెంట్ అభ్యర్థులను నియమించుకుంటాయి. కంపెనీలు క్యాంపస్‌లకు వెళ్లినప్పుడు అభ్యర్థులను వడపోస్తాయి. అందులో తేలిన వారికి ఒక ట్రెండు రోజుల్లో పూర్తిచేయగల పని ఇస్తాయి. దీని ఫలితాల ఆధారంగా అభ్యర్థులను నియమించుకుంటాయి. దీని ద్వారా అభ్యర్థులు తమ సామర్థ్యాలను నిరూపించడానికి కూడా అవకాశం లభిస్తుంది.
- క్యాంపస్‌లలోనే incubation కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా అభ్యర్థులను నియమించుకోవడం తాజా ధోరణి. బిజినెస్ స్కూల్‌లోని తరగతిలో కొంత మందిని ఎంపిక చేసి, వారికి ప్రాజెక్టులు ఇవ్వడం, ఆఫీసు వాతావరణం ఏర్పాటుచేసి పని చేయించడం లాంటి పద్ధతుల ద్వారా శిక్షణ, తర్వాత నియామకాలు జరుగుతాయి. దీని ద్వారా కంపెనీలు తమ అవసరాలకు అనుగుణంగా మేనేజ్‌మెంట్ అభ్యర్థులను తీర్చిదిద్దుకుంటాయి.

## ఆచరణ, అనువర్తనం

మేనేజ్‌మెంట్ విద్యలో ప్రమాణాలకు గీటురాళ్లుగా ప్రస్తుతం చెబుతున్న అంశాలు... ఆచరణ, అనువర్తనం. మేనేజ్‌మెంట్ సూత్రాల ఆచరణకు, అప్లికేషన్‌కు ప్రాధాన్యం ఇచ్చే సంస్థలు, మిగతావాటికంటే మెరుగైనవని చెప్పవచ్చు. అంతర్జాతీయంగా, మనదేశంలోనూ అనేక బిజినెస్ స్కూళ్లు ఈ విషయాన్ని గ్రహిస్తున్నాయి. పరిశ్రమలతో వీలైనంత ఎక్కువగా కోర్సులను అనుసంధానం చేస్తున్నాయి. స్పెషలైజేషన్ ఏదైనప్పటికీ, అనుకున్న సమయానికి, సమర్థంగా వ్యాపార లక్ష్యాలను సాధించగల సామర్థ్యాలను పెంపొందించడమే మేనేజ్‌మెంట్ విద్య మూల సూత్రంగా మారింది. ఆచరణాత్మక దృక్పథం గల కోర్సుల్లో చేరినప్పుడే విద్యార్థులు ఈ సామర్థ్యాలను పెంపొందించుకోగలరు.

